క్లుప్తంగా

జాన్‌పహాడ్ ఉర్సుకు రావాలని మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం

పాలకవీడు : మండలంలోని జాన్‌పహాడ్‌లో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగే దర్గా ఉర్సు ఉత్సవాలకు రావాలని కాంగ్రెస్ మండల నాయకులు .. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గురువారం సచివాలయంలో కలిసి ఆహ్వానించారు. 24న జరిగే గంధోత్సవానికి హాజరవుతానని మంత్రి చెప్పినట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌వి.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, బెల్లంకొండ నరసింహారావు, గుత్తికొండ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో 2025- 26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 10 తరగతుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యం.సాయిఈశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

బీజేపీ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా నరేష్‌గౌడ్



హుజూర్‌నగర్ : భారతీయ జనతా పార్టీ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా అంబళ్ల నరేష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి ఎస్ నామోజీ, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నరేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహరించిన బీజేపీ నాయకులు బొబ్బా భాగ్యరెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, చల్లా శ్రీలతకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

చింతలపాలెం అధ్యక్షుడిగా విజయ్



చింతలపాలెం మండల అధ్యక్షుడిగా దొండపాడుకు చెందిన పత్తిపాటి విజయ్ నియమితులయ్యారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గరిడేపల్లి అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లుగౌడ్



గరిడేపల్లి : బీజేపీ గరిడేపల్లి మండల అధ్యక్షుడిగా తాళ్లమల్కాపురం గ్రామానికి చెందిన కుక్కడపు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి స్నేహితుల చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

పాలకవీడు : మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్.నాగుల్ మీరా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం నాగుల్‌మీరా స్నేహితులు రూ. 29 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, స్నేహితులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

మోతె : మండలంలోని అన్నారిగూడెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని చివ్వెంల ప్రాజెక్టు సీడీపీఓ శ్రీవాణి, మోతె సెక్టార్ ఏసీడీపీఓ కిరణ్మయి నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి బిందు, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, అరుణ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ కటికం ఆశారమేష్

గరిడేపల్లి : మండలంలోని పానుగోడు గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం మాజీ ఎంపీపీ కటికం ఆషారమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నేలపట్ల వెంకటేశ్వర్లు, భద్రయ్య, రాంబాబు, గోపయ్య, హుస్సేన్, వెంకన్న, ప్రభాకర్, గురుస్వామి, రెడ్డిపల్లి సైదులు, కొమర్రాజు సైదులు పాల్గొన్నారు.

‘ముక్కోటి ఏకాదశి’ ప్రారంభం

- నేడు లక్ష ఆరెపత్రి పూజ, గ్రామోత్సవం



విద్యుద్దీపాల వెలుగుల్లో మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి ఉత్సవాలను గురువారం సాయంత్రం ధర్మకర్తలు, అర్చకులు వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో నాదస్వర కచేరీ, వేదమంత్రపఠనం, శాస్త్రీయ సంగీత కచేరీ, సీతాకల్యాణ హరికథ, శ్రీలక్ష్మీనరసింహ నామ సంకీర్తనం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు పార్వతీరామలింగేశ్వరస్వామి, గోదాదేవి, శ్రీఆంజనేయస్వామి ఆలయాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల పుణ్యస్నానాలకు ఆలయం వద్ద ప్రహ్లాద ఘాట్‌లో షవర్ బాత్‌లు ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు సౌకర్యంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తెలుగు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆలయంతో పాటు వివిధ కులాల అన్నదాన సత్రాలు భోజన వసతి కల్పిస్తున్నాయి. ఆలయం వద్ద మఠంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు స్వామి వారు వైకుంఠ(ఉత్తర) ద్వారదర్శనం గావిస్తారని అనంతరం గర్భాలయం ముఖమండపంలో లక్షారెపత్రి పూజ, గరుడవాహనంపై గ్రామోత్సవం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు.



స్వామివారి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు

అలుపెరగని పోరాట యోధుడు కాంతారెడ్డి



కోదాడరూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ములకలపల్లి రాములు

కోదాడరూరల్ : కమ్యూనిస్టు ఉద్యమంలో అలుపెరగని పోరాట యోధుడు ఉప్పల కాంతారెడ్డి అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ములకలపల్లి రాములు కొనియడారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కాంతారెడ్డి 2వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్లు జాస్తి సుబ్బారావు, ఎల్.భాస్కర్‌రావు, సూర్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, చంద్రమోహన్, శివప్రసాద్‌రెడ్డి, అశోక్‌కుమార్, పార్టీ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ఉన్నారు.

కాంతారెడ్డి జీవితం ఆదర్శనీయం

మునగాల : మండల కేంద్రానికి చెందిన సీపీఎం జిల్లా మాజీ నాయకుడు ఉప్పల కాంతారెడ్డి జీవితం ఆదర్శనీయమని డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్ అన్నారు. గురువారం మునగాలలో కాంతారెడ్డి రెండవ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఎం నాయకులు గోపాలం, ఇటికాల వెంకన్న, లంజేపల్లి వెంకన్న, డీవైఎఫ్‌ఐ నాయకులు సైదులు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే



పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మునగాల : మండల కేంద్రంలో గురువారం టీఎస్‌జీఆర్‌ఈఓ మండల శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పెన్షనర్స్ హక్కులు, జీతభత్యాల పెంపు కోసం పోరాటం చేసిన డీఎస్.నకారా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబు మాట్లాడారు. కాగా జనవరి నెలలో పుట్టినరోజు జరుపుకునే పెన్షనర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి అక్కిరాజు లక్ష్మీనరసింహారావు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు

హుజూర్‌నగర్ : భూమిలేని పేదలకు ప్రభుత్వం రూ.12 వేలు అందించే పథకానికి గ్రామ సభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్మారక భవన్‌లో ఆ సంఘం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులు- పాలకుల వాగ్దానాలు - సంక్షేమ పథకాల అమలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషన బోయిన హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ధనుంజయనాయుడు, ఎం.రాంబాబు, దుగ్గి బ్రహ్మం, ఐ.త్రివేణి, ఆర్.సత్యం, జె.వెంకన్న, పి.వీరబాబు, డి.బిక్షం, జి.సైదులు, వెంకటనారాయణ, ఎం.వీరబాబు, కృష్ణమూర్తి, పి.వెంకటరెడ్డి, వీరమల్లు, సూర్యనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏర్పాటు

హుజూర్‌నగర్ : దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు సాముల శివారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

హుజూర్‌నగర్ : ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హార్ట్ ఫుల్ నెస్ సంస్థ సభ్యులు ఎం.రామారావు, వెంకటేశ్వర్లు, మహేంద్ర అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ధ్యానం చేయించారు. ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు బ్రహ్మచారి, నరసింహారావు, నరసింహారాజు, నూగుల్‌మీరా, రమేష్ పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధ్యం

నడిగూడెం : ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధ్యమవుతుందని హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నిర్వాహకుడు నారాయణ లక్ష్మీనర్సింహ అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు గురువారం నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు భయం లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ప్రిన్సిపాల్ బి.విజయ నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

కోదాడ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని కోదాడలోని తేజ ఫార్మసీ కళాశాల సీఈఓ ఎస్ఎస్‌రావు కోరారు. గురువారం కళాశాలలో జరిగిన ఫార్మా ఫెస్ట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కోదాడ పట్టణ సీఐ రాము మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల ప్రభావంతో విద్యార్థులు గాడి తప్పుతున్నారని, వాటిని అవసరం మేరకే ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ పందిరి నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో అపారమైన అవకాశాలున్నాయని, విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదగిరిరెడ్డి, గంగాధరరావు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ రూపొందించడం అభినందనీయం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సలీం షరీఫ్, ఉపాధ్యాయులు

కోదాడ : విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమని కోదాడ ఎంఈఓ ఎండీ. సలీం షరీఫ్ అన్నారు. కోదాడ బాలుర పాఠశాల రూపొందించిన క్యాలెండర్‌ను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మార్కెండేయ, బడుగుల సైదులు, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

7న వేయి గొంతులు, లక్ష డప్పులు



మాట్లాడుతున్న డాక్టర్ ఏపూరి సోమన్న మాదిగ

హుజూర్‌నగర్ : మాదిగ ఉపకులాల వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న వేయి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ ఏపూరి సోమన్న మాదిగ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని పీఎస్‌ఆర్ సెంటర్‌లో పట్టణ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేయి గొంతులు, లక్ష డప్పుల సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు చింతిరాల నాగయ్య, ప్రధాన కార్యదర్శి మంద నాగరాజు, కౌన్సిలర్ కస్తాల శ్రవణ్‌కుమార్, నాయకులు బి.ప్రసాద్, ఎం.శరత్, ఎం.వెంకటేశ్వర్లు, పి.క్రాంతి, ఎం.లక్ష్మయ్య, బి.రామారావు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కూసుమంచి : ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం మీదుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాయకన్‌గూడెం అండర్ పాస్ బ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వెంబడించిన పోలీసులు ఇద్దరిని పట్టుకుని విచారించగా నాయకన్‌గూడెంకు చెందిన కందుల అనిల్‌కుమార్, షేక్ యూసుఫ్‌గా తేలింది. సూర్యాపేట జిల్లా మోతె మండలం అన్నారుగూడెంకు చెందిన చిలకబత్తిన వెంకటేష్, మండవ సాయితో కలిసి గంజాయి విక్రయిస్తున్నట్లు వారు ఒప్పుకున్నారు. వీరి నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, అనిల్, యూసుఫ్‌ను రిమాండ్‌కు తరలించి, మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పేదలకు భూ పట్టాలు ఇవ్వాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్న అర్హులైన పేదలకు భూమి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెంలో ఎస్‌కే జానిమియా అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా డీ ఫారెస్ట్ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు హక్కు పట్టాలు అందజేయాలని కోరారు. అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు, మండల కార్యదర్శి సుందర మొఖేశ్వర్‌రెడ్డి, నాయకులు గోవింద్ రెడ్డి, పుల్లయ్య, మస్తాన్, భూలక్ష్మి, వెంకన్న, మక్బుల్, మస్తాన్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇద్దరు మృతి

పాలకవీడు : గుండెపోటుతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన పాలకవీడు మండల కేంద్రంతో పాటు కోమటికుంట గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడులో సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య(55) బుధవారం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. రాత్రి వేళ గుండెలో నొప్పి వస్తుందంటూ అకస్మాతుగా నేలకొరిగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడుకి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. ఆయన మృతి పట్ల గ్రామస్తులు, నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

కోమటికుంటలో..

కోమటికుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రలో ఆయాగా పనిచేస్తున్న షేక్.హలీమాబీ(57) గుండెపోటుతో మృతి చెందింది. గురువారం ఉదయం ఇంట్లో పనులు చేస్తున్న సమయంలో గుండెనొప్పితో కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

‘ఏడాది పాలనలో పేదలకు ఒరిగిందేమి లేదు’

గరిడేపల్లి : కాంగ్రెస్ ఏడాది పాలనలో పేద ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ ఆరోపించారు. గురువారం మండలంలోని కోనాయిగూడెంలో దోసపాటి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు తుమ్మల సైదయ్య, బ్రహ్మం, వెంకటేశ్వర్లు, అర్జున్, భిక్షం, సైదులు, ఏనాల సోమయ్య పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

- జడ్జి మారుతి ప్రసాద్



జడ్జి మారుతి ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, న్యాయవాదులు

హుజూర్‌నగర్ : కేసుల సత్వర పరిష్కారానికి అదనపు కోర్టుల మంజూరే మార్గమని జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఆవరణలో జడ్జిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో తొమ్మిది వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కేసుల పరిష్కారానికి గాను అదనపు కోర్టుల మంజూరుకు న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యదర్శి జక్కుల వీరయ్య న్యాయవాదులకు క్రికెట్ కిట్లును అధ్యక్షుడు సాముల రామిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ర్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, ఎస్ఎస్ఆర్, జక్కుల నాగేశ్వరరావు, కుక్కడపు బాలకృష్ణ, నట్టే సత్యనారాయణ, రవికుమార్, యాదగిరి, అంజయ్య, ఏజీపీ సురేష్ కుమార్, నాగరాజు, వీరు, సైదా హుస్సేన్, వెంకటేష్, సురేష్, రమేష్, నాగూర్ భాష, నారాయణరెడ్డి, వీజీకే మూర్తి, క్రాంతికుమార్, రమణారెడ్డి, ఎంఎస్ రాఘవరావు పాల్గొన్నారు.

యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు

కోదాడ : యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్వచ్ఛంద సంస్థలు క్రీడలను ప్రోత్సహించాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు కోరారు. గురువారం కోదాడలోని కట్టకొమ్ముగూడెం రోడ్డులో కత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కత్రం శ్రీకాంత్‌రెడ్డి, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఏర్నేని బాబు, పారా సీతయ్య, కందుల కోటేశ్వరరావు, ఈదుల కృష్ణయ్య, సత్యబాబు, భద్రారెడ్డి, ఉమా శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, డాక్టర్ బ్రహ్మం, గాయం పట్టాభిరెడ్డి, నరేష్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



కోదాడరూరల్ : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కోదాడరూరల్ : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం కోదాడ పట్టణంలో ఖమ్మం క్రాస్ రోడ్ నుంచి రంగా థియేటర్ సెంటర్ వరకు పోలీసులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయవద్దన్నారు. హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అదేవిధంగా పట్టణ సీఐ రాము ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ రోడ్డులోని ఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులతో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ రంగా థియేటర్ నుంచి ఎల్ఐసీ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు రాము, రజితారెడ్డి, ఎంవీఐ జిలానీ, పట్టణ ఎస్ఐలు రంజిత్‌రెడ్డి, సైదులు, రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, చిలుకూరు ఎస్ఐ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

23న రోడ్డు భద్రత వారోత్సవాలు

కోదాడరూరల్ : కోదాడ లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 23న నిర్వహించనున్న జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంవీఐ జిలానీ అన్నారు. గురువారం లారీ అసోసియేషన్ కార్యాలయంలో వారోత్సవాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వారోత్సవాల్లో రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు, ఓనర్లు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు తూనం కృష్ణ, యలమందల నరసయ్య, పైడిమర్రి వెంకటనారాయణ, ఆవుల రామారావు, బాబు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆదర్శవంతురాలు.. షేక్ ఫాతిమా



కోదాడ : ఫాతిమా షేక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



హుజూర్‌నగర్ : ఫాతిమా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కోదాడ : నూట యాభై ఏళ్ల క్రితం బడుగు, బలహీన వర్గాలకు విద్యనందించడానికి కృషి చేసిన తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ నేటి తరానికి ఆదర్శవంతురాలని కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్ అన్నారు. గురువారం కోదాడలోని బాలుర పాఠశాలలో ఫాతిమా షేక్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. బాలుర పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మార్కెండేయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజామియా, బడుగుల సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతో ఉపాధ్యాయులకు గుర్తింపు

హుజూర్‌నగర్ : ఉత్తమ బోధనతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని ప్రిన్సిపాల్ రెహానా బేగం అన్నారు. మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా జయంతిని గురువారం హుజూర్‌నగర్ మైనారిటీ బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెరిక హాస్టల్ కార్యవర్గం ప్రమాణస్వీకారం



నూతనంగా ఎన్నికైన పెరిక హాస్టల్ పాలకవర్గం సభ్యులు

కోదాడరూరల్ : నూతన కార్యవర్గ సభ్యులు పెరిక హాస్టల్ అభివృద్ధికి కృషి చేయాలని పలువురు పెరిక సంఘం నాయకులు అన్నారు. పెరిక హాస్టల్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన హసనాబాద రాజేష్, గౌరవ అధ్యక్షుడు పాయిలి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సుందరి వెంకటేశ్వర్లు, కోశాధికారి గుండు అనురాధ, ఉపాధ్యక్షులు ముత్తినేని కోటేశ్వరరావు, దొంగరి సత్యనారాయణ, కందుల చంద్రశేఖర్, కొనకంచి వెంకటేశ్వర్లు, వనం నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని పీర్ల కొట్టం ప్రాంతంలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున్న శుక్రవారం ఆ ప్రాంతంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

సన్నిధానంలో అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదాన కార్యమాన్ని గురువారం చింతల రామయ్యయాదవ్, న్యాయవాది ఆరె పుల్లారావు ఏర్పాటు చేసి ప్రారంభించారు. శుక్రవారంతో అన్నదాన కార్యక్రమం ముగియనుందని నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

మఠంపల్లి : సంక్రాంతి సందర్భంగా పిల్లలు ఎగరేసే గాలిపటాలకు చైనా మాంజా (దారం) విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మఠంపల్లి ఎస్ఐ పి.బాబు అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చైనా మాంజాతో మనుషులకు, పక్షులకు, పర్యావరణానికి తీవ్ర ముప్పు కలుగుతుందన్నారు. చైనా మాంజా విక్రయిస్తూ పట్టుబడితే ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు.

వల్లాపురంలో ‘ఇందిరమ్మ’ సూపర్ చెక్ సర్వే

నడిగూడెం : వల్లాపురంలో గురువారం ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్ ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 22 ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలను యాప్‌లో రెండో సారి నమోదు చేసినట్లు ఎంపీడీఓ ఇమామ్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత



దాతను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరిలో గల ఎస్సీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన గూడెపు నాగేశ్వరరావు జ్ఞాపకార్థం అయన సతీమణి లీలావతి రూ.10 వేల విలువ గల సౌండ్ సిస్టంను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల హెచ్‌ఎం ధనలక్ష్మి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నజీమ్ అంజూమ్, ఇందిరాల జ్యోతి, చందు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పరిశుభ్రం

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ పరిధిలో ఉన్న శ్మశానవాటికలో కంప, పిచ్చిచెట్లు పెరిగి ప్రజలకు ఇబ్బందికరంగా ఉండడంతో గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య రెండు రోజుల క్రితం ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో కార్యదర్శి దేవరం స్వాతి గురువారం శ్మశానవాటికను జేసీబీ సాయంతో శుభ్రం చేయించినట్లు కనయ్య తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

మునగాల : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువారం ఆలయంలో ఆలయ కమిటీ చేపట్టిన వసతి సౌకర్యాలను పరిశీలించి మాట్లాడారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉదయం 3.30 గంటల నుంచి ప్రాతఃకాల ఆరాధన, నాలుగు గంటల నుంచి తిరుప్పావై సేవాకాలం ప్రాభోది, ఉదయం 4.30 నుంచి భక్తులకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, 8 గంటల నుంచి శ్రీవారి గరుడవాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ద్వాదశి కుడారై ఉత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని రామాలయం, శ్రీజ్ఞాన సరస్వతి, అభయాంజనేయస్వామి దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అష్టోత్తరాలతో నివేదన, సౌభాగ్యలక్ష్మి పూజ చేశారు. తిరుప్పావై సేవాకాలాన్ని శ్రద్ధగా గానం చేశారు.